శేరిలింగంపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తాం

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



శ్రీనివాస కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో బీఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గెలుపు కోసం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదివారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో పేదలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి తోడ్పడే విధంగా మానిఫెస్టో ఉందన్నారు. సబ్బండ వర్గాల ప్రజ లకు ఉపయోగకరంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం తథ్యం అన్నారు.

◆ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల పక్షపాతి అన్నారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా, అందరికి సన్నబియ్యం, ఆసరా ఫించన్ల పెంపు, పెన్షన్ పెంపు, రూ.400కు గ్యాస్ సిలిండర్ ఇవ్వటం మహిళలకు పెద్ద ఉపశమనం అన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితి 15 లక్షల పెంపు చేయటం గొప్ప విషమన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీకి ఓటు వేసి హ్యాట్రిక్ విజయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అనుబంద సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

◆ **వివేకానందనగర్ డివిజన్‌లో...**

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివారం వివేకానందనగర్ డివిజన్ మాధవరం రోజాదేవి రంగారావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. రిక్షాపుల్లర్స్‌కాలనీలో రేణుకాఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా, శేరిలింగంపల్లిలో అరెకపూడి గాంధీకి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, నాయినేని చంద్రకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో...**

శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీని ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని కేటీఆర్ కాలనీ, జయశంకర్ కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్ కాలనీల్లో కాలనీ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పలు సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. పార్టీ విజయం కోసం సమష్టిగా కలిసి మెలసి కృషి చేసి అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అష్టవింశ 28వ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటలకు ఉత్సవాన్తస్నపనం, 10.30 గంటలకు జగత్ కల్యాణ నిమిత్తం స్వామివారి మహాకల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హారతి తీర్థప్రసాదములు భక్తులకు అందించారు. ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీవారికి బంగారు జరి వస్త్రాన్ని సత్యనారాయణరాజు, ఝాన్సీలక్ష్మి, స్వామివారి కల్యాణ మూర్తులకు సువర్ణ తాపడ ఆభరణములు సూర్యనారాయణ, నాగసుజని, దినేష్, సింధు, ఉత్సవ విగ్రహాలకు సువర్ణ తాపహారములు లోహిత సాయిలక్ష్మి, నాగలక్ష్మి అందించారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి దిశా నిర్దేశకులు

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, అసోసియేషన్ ప్రతినిధులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ సమతానగర్‌లో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు బాలలకు ఆటల పోటీలు నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో 100 మంది బాలలు పాల్గొని వివిధ ఆటలలో తమ ప్రతిభను చాటారు. ఆదివారం సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ యవజన నాయకుడు పెండెం రాకేష్ మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు సదాలక్ష్మి సంయుక్త అధ్వర్యంలో ఆటల పోటీలు సాగాయి వీల్‌చైర్, టగ్ ఆఫ్ వార్, పాటలు, ఉపన్యాస పోటీలు ఇలా 15 రకాల ఆటలలో బాలలు పాల్గొని తమ సత్తాచాటారు.

◆ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి దిశా నిర్దేశకులని వారిని అన్ని రంగాలలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలన్నారు. ఆటల పోటీలలో ప్రతిభ కనబర్చిన బాలలను జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనేలా వారిని తీర్చిదిద్దాలని కోరారు. కాగా ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన బాలలకు ఈనెల 11వ తేదీన ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతానగర్ అసోసియేషన్ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు, సహాయ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, నితిన్, రామకృష్ణ, మహిళ కార్యవర్గ సభ్యులు రేణుక, ప్రమీలా, స్రవంతి, మీనాక్షి, సుధ తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీలలో ఆటలు ఆడుతున్న బాలలు

ఆకట్టుకున్న స్వర్ దీపావళి

గచ్చిబౌలి: మహారాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన స్వర్ దీపావళి సంగీత కచేరీ అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం ఉదయం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో తత్వఆర్ట్స్, కేశవ్ మెమోరియల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లు సంయుక్తంగా దీపావళి హట్- స్వర్ దీపావళి పేరిట సంగీత కచేరీ నిర్వహించారు. చారుదత్ అపాలే వాయిద్య సహకారంతో విదుషీ మంజుషాపాటిల్ ప్రదర్శించిన శత్రియా, సుగం సంగీతం ఆకట్టుకుంది.

వజ్రాభరణాలపై పెరిగిన ఆసక్తి

సాక్షి, సిటీబ్యూరో: నగర మహిళల్లో వజ్రాభరణాలపై ఆసక్తి బాగా పెరిగిందని, ముఖ్యంగా బ్రాండెడ్ డైమండ్స్‌కి డిమాండ్ ఉందని నిపుణులు తెలిపారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్‌లో ఆదివారం కిస్నా ఆభరణాల బ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో విభిన్న రకాల వజ్రాభరణాల వైవిధ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్తలు వజ్రాభరణాల విశేషాలను వివరించారు. ఘనశ్యామ్ డోలాకియా, పరాగ్‌షా తదితర జువెలరీ రంగ నిపుణులు పాల్గొని మాట్లాడారు.

సాహిత్యంపై చిన్నప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలి

• **జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత దామోదర్ మాజో**



దామోదర్ మాజోను సన్మానిస్తున్న ఎస్ఎస్‌కేకే పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఎం. థామస్

బాలానగర్: విద్య మనిషికి మార్గదర్శకం చేస్తుందని జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత దామోదర్ మాజో అన్నారు. ఆదివారం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఎస్‌కేకేపాఠశాల ఆవరణ లో 'ఓ'వోవ్ విజయన్ సాహిత్య పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దామోదర్ మాజో మాట్లాడుతూ... విద్య ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. విద్యతోనే మనిషిలో సంస్కారం వెల్లివిరుస్తుందన్నారు. ఎవరు దోచుకెళ్లలేనిది విద్య అని తెలిపారు. విద్యతో పాటు సాహిత్య రంగంపై చిన్నతనం నుంచే అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. నేటి సమాజంలో సాహితి రంగం పట్ల రోజు రోజుకు ఆదరణ తగ్గిపోతోందని పేర్కొన్నారు. మన భాషను, సంస్కృతిని ఎక్కడ ఉన్నా ప్రేమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాతృభూమి వార పత్రిక ఎడిటర్ సుభాష్ చంద్రన్, రచయిత సిఆర్ నీల కందన్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఎం. థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో మలయాళం బుక్ ఫెయిర్‌ను నిర్వహించారు. దీనికి పుస్తక ప్రేమికుల నుంచి విశేష ఆదరణ లభించింది.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం



రామకృష్ణనగర్‌లో ఎన్నికల ప్రచారంలో విద్యాకల్పన, ఏకాంత్ గౌడ్ తదితరులు

జంగ్ 2023 తెలంగాణ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్‌లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ముమ్మర ప్రచారం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో నాయకులు దూసుకుపోతున్నారు. డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి కార్యకర్తలు, మహిళలతో కలసి ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ముమ్మర ప్రచారం సాగిస్తున్నారు. ఈ సందర్భంగా దండుగుల యాదగిరి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బండి రామకృష్ణ, కాకర్ల అరుణ, విజయలక్ష్మి, జ్యోతి, దండుగుల సందీప్, పి.అంజి, అనంద్, షాయిన్‌షా, కిరణ్‌గౌడ్, శ్రీను, శ్రీకాంత్, శ్రీరాములు, అమ్జద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన గొట్టిముక్కల వెంగళరావు



కూకట్‌పల్లి: ఇటీవల కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల విశ్వతేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్‌లో టీడీపీ ముఖ్యనేతల సమావేశం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. రానున్న ఎన్నికల్లో భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు, కంటెస్టెంట్ కార్పొరేటర్ రామోజు శివకుమార్, ఆర్గనైజేషన్ సెక్రటరీ పాతూరి వెంకట్రావు, చేవెళ్ల పార్లమెంట్ నాయకులు ఎన్ఎస్ రాజు, డివిజన్ అధ్యక్షుడు వెంకటయ్య, జనరల్ సెక్రటరీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీసీ నుంచి కేబీఆర్ పార్కుకు సైకిల్ రైడ్

రాయదుర్గం: సైకిల్ రైడర్లు సైకిల్ రైడ్‌ను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున గచ్చిబౌలిలోని హెచ్‌బీసీ బై సైకిల్ స్టేషన్ వద్ద ఈ సైకిల్ రైడ్‌ను ప్రారంభించారు. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ పర్యవేక్షణలో ఈ బైసైకిల్‌రైడ్‌ను నిర్వహించారు. హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్ వద్ద ఆరంభమైన ఈ రైడ్ మైండ్ స్పేస్ జంక్షన్ నుంచి మాదాపూర్ దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా లోటస్‌పాండు, కేబీఆర్ పార్కు వరకు నిర్వహించారు. అనంతరం అక్కడ కొద్దిసేపు సేదతీరిన తర్వాత తిరుగుముఖంలో అదే మార్గంలో తిరిగి గచ్చిబౌలిలోని హెచ్‌బీసీ బైక్‌స్టేషన్ వరకు ఈ సైకిల్‌రైడ్ కొనసాగింది. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ.. ఆదివారం రోజు ప్రత్యేక సైకిల్‌రైడ్‌ను ఉదయం 5.30 ప్రారంభిస్తారని, ఆసక్తి ఉన్న సైకిల్ రైడర్లు పాల్గొనవచ్చన్నారు. రైడర్లు నేరుగా హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్‌కు రావొచ్చని, ఇక్కడ సైకిళ్లు సిద్ధంగా ఉంటాయన్నారు. హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్ నుంచి నగరం, శివారులోని వివిధ ప్రాంతాల వరకు ఈ రైడ్‌లను కొనసాగిస్తామన్నారు.

నేటి నుంచి 'మనూ'లో ఆజాద్ జయంతి వేడుకలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆజాద్ డే వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 11 వరకు స్వతంత్ర భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఆజాద్ డే వేడుకల పేరిట ఆరు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. ఫలక్‌నామా సమీపంలోని వట్టేపల్లిలోని 'మనూ' మోడల్ స్కూల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ అధ్యక్షత నిర్వహిస్తారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పాల్గొంటారు. 10న ఉదయం 9.30 గంటలకు డీడీఈ ఆడిటోరియంలో ఆజాద్ స్మారక ఉపన్యాసం ఉంటుంది. ఢిల్లీలోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సలీల్ మిశ్రా 'మౌలానా ఆజాద్ మేకింగ్ ఆఫ్ మోడర్న్ ఇండియా' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

కారు గుర్తుకే ఓటేయాలి

కూకట్‌పల్లి నియోజకవర్గంలో జోరుగా ప్రచారం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని వెంకట్రావ్‌నగర్ కాలనీ, రామయ్యనగర్ కాలనీల్లో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి కంటి ముందు కనిపిస్తుందన్నారు. ఉదయమే అందరికి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే మాధవరం కృష్ణారావుకు భారీ మెజార్టీ వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్రేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం...

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన అమ్రేష్ గౌడ్ పేర్కొన్నారు. ఇంటింటి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. డిసెంబర్ 3న ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో, కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బంపర్ విజయం సాధిస్తారన్నారు.



కూకట్‌పల్లి డివిజన్‌లో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూన అమ్రేష్‌గౌడ్



ఇక్కడ ఉండేవాళ్లందరూ తెలంగాణ బిడ్డలే..

కాపుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, హాజరైన కాపు కులస్తులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కాపుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో నివసిస్తున్న కాపు సోదరుతు తనను ఎప్పుడు సోదరుడిగా భావించి అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కులాలు, మతాలకతీతంగా అందరం అన్నదమ్ముల వలే కలిసి ముందుకు వెళుతున్నామని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ స్థాయి నగరాల్లో హైదరాబాద్ మహానగరాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చారని అన్నారు.

◆ **ప్రశాంతమైన వాతావరణం ఉండాలంటే కేసీఆర్ సీఎంగా ఉండాలి...**

వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగం, వ్యాపారం రీత్యా ఇక్కడకు వచ్చి జీవనం సాగిస్తున్న వారందరు కూడా తెలంగాణ బిడ్డలేనన్నారు. అందరం కలిసి ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా జీవిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి వాతావరణం కొనసాగించాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు తమ పబ్బం గడుపుకోవడం తప్ప ప్రజల గురించి ఆలోచించరని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పాలించిన రోజులు ఎలా ఉన్నాయో హైదరాబాద్ వాసులు గమనించారన్నారు. గతంలో కర్ఫ్యూలు, బాంబుదాడులతో ఎక్కడ ఎలా ఉంటుందోనని ప్రజలు వణికిపోయేవారని ఈ పదేళ్ల కాలంలో ఎటువంటి సంఘటన చోటు చేసుకోకుండా హాయిగా జీవిస్తున్నామని పేర్కొన్నారు.

◆ **ఎమ్మెల్యేకు మద్దతుగా కాపు నేతలు..**

ఈ సందర్భంగా కాపు నాయకులు తమ పూర్తి మద్దతు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకే అని ప్రకటిస్తూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు తూము శ్రావణ్‌కుమార్, బాబురావు, కేపీహెచ్‌బీ ఇన్‌చార్జి అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, హెచ్ఎం మూర్తి, శ్రీనివాసరావు, రమణప్రసాద్, వలవల నాయుడు, భవాని, ధనలక్ష్మీ, సత్తిబాబు, పున్నారావు, రంగమోహన్, రాజేష్, గుట్ట శంకర్, దినేష్ నాయుడు, గంధం బాలకృష్ణ, సిహెచ్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్‌ఎస్ పార్టీలో భారీగా చేరికలు...**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి 350 మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన అభివృద్ధిని చూసి, అన్ని వర్గాల వారికి అందుతున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్‌ఎస్‌లో చేరామన్నారు. ఆయన విజయానికి కృషి చేస్తామని తెలిపారు.



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పలు పార్టీల నాయకులు

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్



ఇంటిటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్, సత్యం శ్రీరంగం తదితరులు

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అల్లాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ ప్రచారం చేశారు. ముందుగా కేఎస్‌నగర్‌లోని దర్గాలో, శివాజీనగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు చేశారు. ఆ తర్వాత ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేసిన డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించారు. గెలిపిస్తే నూటికి నూరు శాతం ఆరు పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌తోనే సబ్బండ వర్గాలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు.

◆ **మోసగించే ఎత్తుగడలు వేస్తే ఓటుతో బుద్ధి చెబుతారు..**

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సోనియాగాంధీ ఇచ్చిన హామీలు, మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధులకు పెన్షన్, యువ వికాస్ తదితర పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. శివాజీనగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించటం లేదన్నారు. కూకట్‌పల్లి నియోజనకవర్గంలో ఓటు అడిగే హక్కు లేక ముఖం చాటేసి బెదిరించి దొంగదారిన ఓట్లను దండుకొని ఇంకా ఎన్నాళ్లు అహంకార పాలన సాగిస్తారని ప్రశ్నించారు. ప్రజలను మోసగించే ఎత్తుగడలు వేస్తే ప్రజలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పే రోజు వస్తుందన్నారు. కాలనీవాసులకు ఎన్ని ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. సుమారు 4 సంవత్సరాల నుంచి పెన్షన్ రాక ఎందరో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

◆ **బీజేపీతో దోస్తీ.. అరెస్టు కాకుండా ఆపి..**

రాష్ట్రంలో లిక్కర్ వ్యాపారం మాత్రం అభివృద్ధి అయ్యిందన్నారు. బీజేపీతో దోస్తీ చేసుకొని లిక్కర్‌రాణి అరెస్టు కాకుండా ఆపుకున్నారని ఆరోపించారు. పేదలకు బతుకుదెరువు లేక.. నిరుద్యోగులకు ఎక్కడా ఉద్యోగాలు రాక వారికి పెళ్లిళ్లు కాక తల్లిదండ్రులకు బుక్కెడు బువ్వ పెట్టని దుస్థితి ఈ తెలంగాణ ప్రభుత్వ పాలనలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందన్నారు. తిరిగి కాంగ్రెస్ పాలనతో మన తలరాతలు మారతాయని అన్నారు. ఎవరు ఆత్మహత్యలు చేసుకోవద్దని విద్యార్థులకు యువ భరోసా పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యం శ్రీరంగం, తూము వేణు, నరసింహ యాదవ్, చోటా మోయిజ్, ఫజల్, జావీద్, భారతమ్మ, పల్లపు వేణు తదితరులు పాల్గొన్నారు.

◆ **బంగారు తెలంగాణ పేరుతో మభ్య పెడుతున్నారు..**

మూసాపేట డివిజన్‌లోని మారుతీనగర్, పటేల్‌నగర్‌చ, యాదవబస్తీల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పది సంవత్సరాల నుంచి బంగారు తెలంగాణ అంటూ ప్రజలను మభ్య పెడుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. బస్తీ దవాఖానాలో ప్రజల ఆరోగ్యంపై మానసికంగా చెలగాటం ఆడుతున్నారని అన్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో మందులు ఉండవని, డాక్టర్లు ఉండరని, పేరుకు మాత్రం బోర్డు ఉంటుందన్నారు. ఈ పదేళ్ల పాలనపై బీఆర్‌ఎస్ నేతలు చర్చకు సిద్ధమా? అని సవాలు విసిరారు. ఈసారి కాంగ్రెస్ వస్తే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, పేదరికం నిర్మూలనకు నాంది పలికే యువ భరోసా పథకం, 5 లక్షల విలువ చేసే ఆరోగ్యశ్రీ కార్డు వంటి పథకాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు సత్యం శ్రీరంగం, గోపిశెట్టి రాఘవేందర్, డివిజన్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు జోజమ్మ, యూత్ అధ్యక్షుడు సచిన్, నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేలాది కోట్లతో అభివృద్ధి చేశాం

సంక్షేమ సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: మూసాపేట డివిజన్ పరిధిలోని మైస్టిక్ హిల్స్, మూసాపేట జనతానగర్, శక్తి నగర్ లలో వివిధ సంఘాల నాయకులతో ఆదివారం ఎమ్మెల్యే కృష్ణారావు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిత్యం అందుబాటులో ఉంటు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రతి ఇంటికి మంచినీరు అందేలా నియోజకవర్గంలో రిజర్వు ట్యాంకులు నిర్మించుకున్నామని తెలిపారు.

◆ అంతేకాకుండా ప్రతి వీధిలో సీసీ రోడ్డు, ప్రతి ప్రాంతంలో ఆహ్లాదకరమైన పార్కులు, ఇండోర్ స్టేడియాలు, సంక్షేమ పథకాలైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, ఆసరా ఫించన్లు, సీఎం రిలీఫ్ ఫండ్ వంటి అనేక పథకాల ద్వారా అనేక మంది పేదలకు లబ్ధి చేకూర్చామని పేర్కొన్నారు. తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మూసాపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో జరిగిన ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్న, మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు